76809 94755 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2019-21



విజయవాడ బందర్ రోడ్డులో ఆధునిక సౌకర్యాలతో మీటింగ్ హాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో 50 మందితో సమావేశాలు జరుపుకోవచ్చును. ఫోన్: 94406 62699

# రాజధాని వార్తలు

Voice of Voiceless

## రంజాన్ వేళలు

| తేది | వారం | సహర్ (ఉ॥) | ఇఫ్తార్ (సా॥) |
|---|---|---|---|
| 6 -5-2019 | సోమవారం | 4.18 | 6.33 |
| 7 -5-2019 | మంగళవారం | 4.18 | 6.33 |
| 8 -5-2019 | బుధవారం | 4.16 | 6.33 |
| 9 -5-2019 | గురువారం | 4.16 | 6.33 |
| 10 -5-2019 | శుక్రవారం | 4.15 | 6.34 |
| 11 -5-2019 | శనివారం | 4.15 | 6.34 |
| 12 -5-2019 | ఆదివారం | 4.14 | 6.35 |

అమరావతి సంపుటి : 4 సంచిక : 31, పేజీలు 4, వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ ' రాజధాని' తొలి తెలుగు వార పత్రిక సోమవారం 6 - ఆదివారం 12 మే, 2019

## కాపీ కొట్టు సర్టిఫికెట్ పట్టు ?

**రాజధాని వార్తలు, రేపల్లె :** ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం నిర్వహించే 10వ తరగతి, ఇంటర్ మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఈ నెల 1న మొదలైనవి. 3,4వ తేదీ పరీక్షలు వాయిదా వేయటంతో 6వ తేదీ నుండి 10వ తేదీ వరకు జరుగుతాయి. రివైజ్ట్ టైం టేబుల్ కొరకు www.apopenschool.orgలో చూడవచ్చు. అయితే రేపల్లె పట్టణంని మున్సిపల్ హైస్కూలులో (ఓల్డ్‌టౌన్), రైల్వేస్టేషన్ ప్రక్కన ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ పరీక్షలకు దాదాపు 300 విద్యార్థులు హాజరవుతున్నారు. ఈ సెంటర్‌లలో భారీగా విద్యార్థులు పుస్తకాలు, గైడ్లు, చూసి రాస్తున్నారని తెలిసింది. దీనికి ప్రభుత్వ అధికారులు, స్కూలు, కాలేజీ అధికారులు, టీచర్లు సైతం సపోర్టు చేస్తున్నారని స్థానికులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు జోక్యం చేసుకుని తగు జాగ్రత్తలు తీసుకొవాలని స్థానికులు కోరుతున్నారు.

## ఇదీ మన ఆంధ్రా సింగపూర్ పరిస్థితి



- ఆకల్ని భరించలేక.. మట్టి తిని చిన్నారి మృతి


ఒక పక్క తిండి లేక మట్టి తిని చిన్నారి చనిపోతే, మరో పక్క చంద్రయాన్ ప్రయోగానికి ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రజల ప్రాథమిక అవసరాలు తీర్చి , ఆ తరువాత మీ ఇష్టం

- చంద్రయాన్ ప్రయోగానకి సిద్ధమైన ఇస్రో



## 'ఫణి' తుఫాన్‌తో

# తెలుగు రాష్ట్రాల్లో మంటే..





**రాజధాని వార్తలు, అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తరాంధ్రను వణికించిన 'ఫణి' తుఫాను తెలుగు రాష్ట్రాల్లో అగ్గి రాజేసింది. సరిగ్గా ఎండాకాలంలో రావడం వల్ల మొత్తం వాతావరణ వ్యవస్థను అల్లకల్లోలం చేసింది. దీని ప్రభావంతో సోమవారం నుంచీ ఎండల తీవ్రత మరింత పెరగబోతోంది. 'ఫణి' తుఫాను అది రాకముందు వరకూ వాతవరణం ఓ పద్ధతిలో ఉంది. ఎప్పట్లాగే సమ్మర్ ఎండలు కొనసాగేవి. కానీ ఫోణి రావడం వల్ల వాతావరణంలో నీటి ఆవిరిలో హెచ్చు తగ్గులు ఏర్పడ్డాయి. వచ్చే రెండు మూడు రోజుల్లో భూమి మరింత సెగలు కక్కుతుంది. భూమిపై నుంచీ నీటి ఆవిరి ఆకాశానికి వెళు_ంటే... మనకు ఉక్కపోత విపరీతంగా పెరుగుతుంది. దీనికి తోడు పశ్చిమం నుంచీ వచ్చే వేడిగాలులు మనకు ఊపిరాడనివ్వకుండా చేస్తాయి. ఉత్తరాంధ్ర మినహా మిగతా ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 3–5 డిగ్రీలు పెరిగాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో మరో రెండ్రోజుల పాటు వడగాలుల ప్రభావం కొనసాగుతుందని హెచ్చరించారు.

ఫణి తుఫాను కోస్తాంధ్ర తీరం వెంబడి ప్రయాణించినప్పుడు రాష్ట్రంలోని తేమ అంతటినీ లాగేసుకుంది. దీంతో తీర ప్రాంతాలు, రాయలసీమ, తెలంగాణలో శుక్రవారం పొడి వాతావరణం కొనసాగింది. ఏపీలోని చాలా ప్రాంతాల్లో 40 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నెల్లూరు జిల్లా కావలిలో అత్యధికంగా 44.6 డిగ్రీలు నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు మినహా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వడగాలుల ప్రభావం కొనసాగుతోంది. తీరప్రాంతానికి దగ్గరగా ఉన్న తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి తదితర జిల్లాల్లోనూ వడగాల్పులు వీస్తున్నాయి. తుపాను ప్రభావం వల్ల విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో శనివారం నుంచి ఉత్తరాంధ్రలోనూ ఉష్ణోగ్రతలు పెరిగి వడగాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేస్తోంది.

ఇప్పటికే కొద్ది రోజులుగా భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. ప్రధాన నగరాలు, పట్టణాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల మధ్య కాలంలో ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. దీంతో రోడ్లు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. కర్నూలులో 43 డిగ్రీలుగా రికార్డయింది. రాబోయే

- మిగతా 3 లో



2014 అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ జరుగుతున్న దృశ్యం (ఫైల్)

### ఎన్నికల ఫలితాల రోజు రాష్ట్రంలో

# ఉద్రిక్త పరిస్థితులు ?

- ఈసీ అనుమానం
- రెండు -మూడు రోజులు భారీ భద్రతా ఏర్పాట్లు

**రాజధాని వార్తలు, అమరావతి :** సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు 23 న జరుగనుండగా – ఆ రోజు రాష్ట్రంలో అల్లర్లకు, విధ్వంసాలకు అవకాశం ఉన్నట్లు వార్తలు రావడం ఎన్నికల కమీషన్ ను కలవరపెడుతున్నది. ఏప్రిల్ 11 న ఎన్నికల రోజు కొన్నిచోట్ల ఈవీఎం లు మొరాయించడంతో అధికారంలో ఉన్న తెలుగుదేశం – ఎన్నికల కమీషన్ల మధ్య వివాదం జరిగిన విషయం విదితమే. ఆ తర్వాత కూడా ఎన్నికల నిర్వహణలో కమీషన్ విఫలమైనదని ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలోనూ, దిల్లిలోనూ ఆందోళనలు చేశారు.

ఎన్నికల ఫలితాలలో తమకు 100 కు పైగా స్థానాలు వస్తాయని ప్రధాన పక్షాలు తెలుగుదేశం, వైకాపా ప్రకటనలు చేశాయి. రెండు పార్టీల నాయకులు భారీ విజయం తథ్యమన్న రీతిలో మాట్లాడుతున్నారు. ఈ కారణంగా ఫలితాలను బట్టి ఘర్షణలు చెలరేగే అవకాశం ఉందని పోలీసు వర్గాలు భావిస్తున్నట్లు తెలుస్తున్నది. ఎలాగైనా విజయం సాధించాలనే లక్ష్యంతో రాజకీయ పార్టీలు ముఖ్యంగా అధికార, ప్రతిపక్ష పార్టీలు భారీ స్థాయిలో డబ్బులు ఖర్చు పెట్టాయి. ఫలితాలు

- మిగతా 3 లో





## ప్రతిపక్షాల అనైక్యతపై మోదీ ఆశలు



**రాజధాని వార్తలు, అమరావతి :** ప్రస్తుత లోక్ సభ ఎన్నికలలో ఎన్డీఏ – ప్రత్యేకించి భాజపా సంఖ్యాబలం తగ్గటం తథ్యమని సర్వేలే కాదు– భాజాపాలో చాలామంది నాయకులు కూడా భావిస్తునారు. మోదీ నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్న యూపీఏ హెచ్చు స్థానాలు గెలుచుకోవచ్చని ఒక అభిప్రాయం బలంగా ఉన్నా – ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సంఖ్యాబలం లభిస్తుందా అనే విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కాని యుపీఏ లో ప్రస్తుతం భాగస్వామ్యం లేని పార్టీలు చాలా ఉన్నాయి. రెండు కూటములకు దూరంగా ఉన్న ప్రాంతీయ పార్టీలు ఎక్కువ సంఖ్యలో స్థానాలు సంపాదించే అవకాశాలు ఉన్నాయని ఒక అంచన. ఒకవేళ వీరుకూడా యూపీఏ ని సమర్థిస్తే

- మిగతా 2 లో

## ఎన్ఆర్ఐ జనరల్ హాస్పిటల్ ప్రాథమిక చికిత్సా కేంద్రం ప్రారంభం






మాట్లాడుతున్న డాక్టర్ నిమ్మగడ్డ ఉపేంద్రనాథ్, డాక్టర్ మని అక్కినేని

**రాజధాని వార్తలు, మందడం :** తుళ్ళూరు మండలం మందడం గ్రామంలో ఎన్ఆర్ఐ హాస్పటల్ సౌజన్యంతో రూరల్ హెల్త్ సెంటరును ప్రారంభించారు. దీనికి మందడం గ్రామవాస్తవులైన ఆలూరి కుటుంబీకులు ఒక భవనంను విరాళంగా అందచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో ఎన్ఆర్ఐ హాస్పిటల్ అధ్యక్షులు డా॥ నిమ్మగడ్డ ఉపేంద్రనాథ్, కోశాధికారి డా॥ మని అక్కినేని భవన దాత ఆలూరి ప్రసాద్ మాట్లాడారు. రాజధాని ప్రాంత వాసులు ఈ హెల్త్ సెంటర్‌లో చికిత్సా సేవలు ఉచితంగా పొందవచ్చున్నారు. ఈ సందర్భంగా డా॥ ఉపేంద్రనాథ్ మాట్లాడుతూ మందడం పరిసర ప్రాంతాలలో ఎక్కువ జనాభా ఉండటం, ప్రాథమిక చికిత్సా కేంద్రం దగ్గరలో లేకపోవటంతో మందడం గ్రామంలో తమ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించామన్నారు. హెల్త్ సెంటర్ దాత ఆలూరి ప్రసాద్‌ను ఆయన

- మిగతా 2 లో



# పోలింగ్ ముగిసింది.. కౌంటింగ్ మిగిలింది




దేశచరిత్రలో ఎన్నికలు జరిగిన తర్వాత 43 రోజులకు ఓట్ల లెక్కింపు జరగనుంది. భారత దేశంలో ఇంత సుదీర్ఘంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగడం ఇదే తొలిసారి. ఎన్నికల కౌంటింగ్ రాజకీయపార్టీలు, ఏజెంట్ల సమక్షంలో జరుగుతుంది. ప్రతి రౌండ్‌లోనూ వారు సంతృప్తి చెందిన తర్వాతే ఫలితాలను అధికారులు వెల్లడిస్తారు.

**ఓట్ల లెక్కింపు ప్రక్రియ**

ఓట్లను లెక్కించేందుకు ముందుగా ఈవీఎంలోని ఫలితాల విభాగానికి ఉన్న సీల్‌ను తొలగించి, ఈవీఎం బయటి కప్పు మాత్రమే తెరుస్తారు. లోపలి భాగాన్ని తెరవకుండా అలాగే ఉంచుతారు. తర్వాత ఈవీఎం పవర్ ఆన్ చేస్తారు. బ్యాటరీలో ఛార్జింగ్ తక్కువగా ఉంటే ఆ మెషీన్‌కి ఉండే డిజిటల్ తెర మిణుకుమిణుకుమని వెలుగుతుంది. లేదంటే ఖాళీగా కనిపిస్తుంది. అప్పుడు కొత్త బ్యాటరీ అమర్చాలి. అనంతరం లోపల బటన్ మాదిరిగా కనిపించే సీల్‌ను తొలగిస్తే ఎన్నికల మీట కనిపిస్తుంది. ఆ మీట నొక్కగానే ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు పోలయ్యాయో తెరపై కనిపిస్తుంది. అధికారులు ఆ వివరాలను జాగ్రత్తగా నోట్ చేసుకుంటారు. 80 కోట్ల మంది ఓటర్లు, 2,000కు పైగా రాజకీయ పార్టీలు పాల్గొనే సాధారణ ఎన్నికలను నిర్వహించడం భారత్‌కు ఓ పెద్ద సవాలే. ఇంత సంక్లిష్ట ప్రక్రియలోని విశ్వసనీయత అంతా దాని పారదర్శకతపైనే ఆధారపడి ఉంటుంది.

**ఈవీఎంల భద్రత**

భారత్‌లో వినియోగిస్తున్న 1.6 కోట్ల ఓటింగ్ యంత్రాల్లో ఒక్కోదానిలో 2000 ఓట్లు నమోదు చేయవచ్చు (ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1500 మందికి మించి ఓటర్లు ఉండరాదు). 64 మంది అభ్యర్థుల పేర్లను చూపించవచ్చు. భారత్‌లోనే తయారయ్యే ఈ మెషీన్లను బ్యాటరీ పవర్‌తో కూడా ఉపయోగించవచ్చు. దీనివల్ల కరెంటు సౌకర్యం సరిగా లేని మారుమూల గ్రామాల్లో సైతం వీటితో ఎన్నికలు నిర్వహించారు. దీనిలో ఉపయోగించే సాఫ్ట్‌వేర్‌ను ఈసీఐఎల్ ఇంజనీర్ల బృందం అభివృద్ధి చేసింది. ఈ బృందానికి తప్ప వేరెవరికీ ఈ సాఫ్ట్‌వేర్ గురించి గానీ, ఈవీఎంలకు సంబంధించిన ఇతర వివరాల గురించి గానీ తెలిసే అవకాశం లేదని ఈసీఐఎల్ వర్గాలు స్పష్టం చేశాయి.

ఎవరైనా బలవంతంగా, నిబంధనలకు విరుద్ధంగా ఓట్లు వేయాలని ప్రయత్నిస్తే, మెషీన్ పనిచేయకుండా చేసేలా ఈవీఎంపై ఓ బటన్ కూడా ఉంది. పోలింగ్ స్టేషన్‌లోని సిబ్బంది అవసరమైన సమయంలో దీన్ని నొక్కవచ్చు. పోలింగ్ ముగిసిన తర్వాత దీనికి పాతపద్ధతిలోనే లక్కతో సీల్ వేసి, దానిపై ఓ స్టిక్కర్ అతికించి, స్టాంప్ వేస్తారు. దీంతో ఎలాంటి మార్పులకూ అవకాశం ఉండదు. ఇప్పటి వరకూ మూడు సాధారణ ఎన్నికలు, 113 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎంలను ఉపయోగించారు.

బ్యాలెట్ పద్ధతిలో పోలింగ్ జరిగినప్పుడు ఒక్కో పార్లమెంటరీ నియోజకవర్గంలో ఫలితం తేలాలంటే కనీసం 40 గంటలు పట్టేది. ఈవీఎంల వినియోగంతో అది 5 గంటలకు తగ్గిపోయింది. ఎలాంటి అవకతవకలకు, మానవ తప్పిదాలకు ఆస్కారం లేకుండా ఎన్నికలు నిర్వహించేందుకు వీలు కలిగిందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈవీఎంల ప్రభావం అనే అంశంపై పరిశోధనలు చేసిన శిశిర్ దేవ్‌నాథ్, ముదిత్ కపూర్, షమికా రవి తమ పరిశీలనలను 2017లో సమర్పించారు. ఈవీఎంల ప్రవేశం కారణంగా అందరూ తమ ఓటు హక్కు ఎన్నికల్లో అక్రమాలకు అడ్డుకట్ట పడిందని, ఎన్నికలను మరింత సమర్థంగా నిర్వహించే వెసులుబాటు కలిగిందని తమ నివేదికలో వీరు పేర్కొన్నారు.

**ఈవీఎంల హ్యాకింగ్ సాధ్యమేనా?**

ఇన్ని వేల ఈవీఎంలను హ్యాక్ చేయాలంటే చాలా డబ్బు అవసరమని, ఒకవేళ చేయాలనుకున్నా దానికి ఈవీఎంల తయారీలో భాగమైన ఇంజినీర్ల సాయం అవసరమని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ)కు చెందిన నిపుణుడు ధీరజ్ సిన్హా అభిప్రాయపడ్డారు. ఓటర్ల మనసుల్లో ఉన్న అనుమానాలు వీవీప్యాట్‌ల ద్వారా తొలగవచ్చని మాజీ సీఈసీ ఎస్‌వై ఖురేషీ అభిప్రాయపడ్డారు.

"2015 నుంచి అన్ని రాష్ట్రాల ఎన్నికల్లో వీవీప్యాట్లను ఉపయోగిస్తున్నారు. వీటిలో దాదాపు1500 మెషీన్లకు ఉన్న పేపర్ స్లిప్‌లను పోలైన ఓట్లతో కలిపి లెక్కించారు. ఒక్కటి కూడా తేడా రాలేదు" అని ఆయన అన్నారు. – ఖాన్

# రాజధాని వార్తలు కలం

## ఆడంబరాలకు ఆర్టీసీ బలి

దక్షిణ భారతదేశంలోని ఏరాష్ట్రంలోనైనా కనీస ప్రయాణపు చార్జి రూ.5 మాత్రమే.. రాష్ట్రప్రభుత్వ సీఎన్‌జీ బస్సులపై ఇదే రాసికూడా ఉండేది. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత దానిని రూ.8కు పెంచారు. రెండు రూపాయల చిల్లర సమస్య ఎక్కువగా ఉంటుందని ఆపై దానిని రూ.10 గా మార్చారు. అంటే మిగతా రాష్ట్రాలతో పోల్చుకుంటే ఏపీలో రెట్టింపు చార్జీలు వసూలు చేస్తున్నారు. అసలే ఆర్టీసీ పెట్రోలు బంకులపై విధిస్తున్న వ్యాట్‌తోనూ, టోల్ పన్నులతోనూ ఆర్టీసీ నష్టాల బాట పడితే, మూలిగే నక్కపై తాటి పండు పడినట్లు ఆర్టీసీని పూర్తిగా దివాళా తీయించిన ఘనత చంద్రబాబుదే అని చెప్పక తప్పదు. కృష్ణా పుష్కరాలకు ఉచిత బస్సులు, దీంతో పుష్కరాల్లో పోలో మంటూ పనిపాటా లేనివాళ్లంతా బస్సులు దిగకుండా ఊరంతా గంటల తరబడి తిరిగారు. దీంతో రోజువారీ పనులకు వెళ్లేవారు నిలబడటానికి కూడా చోటు దొరకక నానా ఇబ్బంది పడ్డారు. ఏదైనా ప్రకృతి వైపరీత్యాలకు, తుపానులకు గురైన వారిని తరలించడానికి ఉచిత బస్సు సర్వీసులు నడిపినా అర్థం ఉటుందికాని ఇలా పుష్కరాలకు ఉచిత సర్వీసులు నడిపి, వాటిని మరిన్ని నష్టాల్లోకి తీసుకెళ్లిన ఘన తెలుగుదేశం ప్రభుత్వానిదే.

అయితే ఇంతటితో ఆర్టీసీ నష్టాలు ఆగలేదు.. చంద్రబాబు ఏ కార్యక్రమం నిర్వహించినా, ముందుగా బలైపోయేది ఆర్టీసీనే.. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం ముఖ్యమంత్రిగా ఆయన బాధ్యత సహకరించడం ప్రజల విధి. దీన్ని కాదని ఎవరూ అనరు. ఇందుకు సంబంధించి పనులు మానేసి నవనిర్మాణ దీక్షలు చేపట్టి అందుకు భారీగా జనాలను తరలించేందుకు ఆర్టీసీ బస్సులు ఇబ్బడిముబ్బడిగా వినియోగించారు. ఆపై రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వలేదంటూ, చంద్రబాబు యూటర్న్ తీసుకొని ధర్మపోరాట దీక్షలు చేస్తే డ్వాక్రా మహిళలను తరలించడానికి ఆర్టీసీ బస్సులు.. ఇవి చాలవన్నట్లు అమరావతిలో ఆయన చేసిన అభివృద్ధిని చూపడానికి ఉచిత బస్సులు, పోలవరం సందర్శించడానికి ఆర్టీసీ బస్సులు.. ముఖ్యమంత్రి ఏరోజు ఎక్కడ సభలు పెడితే ఆయా చోట్ల బస్సులు లేక ప్రయాణీకులు నానా అగచాట్లు పడటం ఈ ఐదేళ్లలో ఒక తంతులా మారింది. వాస్తవానికి ప్రజా ఆస్తులకు సంరక్షకులుగా వ్యవహరించాల్సిన చంద్రబాబు ప్రజాధనంపై విపరీతమైన అలసత్వం, అలక్ష్యం ప్రదర్శించి ఆర్టీసీని అప్పుల ఊబిలోకి తోసి, ప్రైవేటుపరం చేయడానికి ఎంతగానో కృషి చేశారు. దేశ, రాష్ట్ర రాజకీయ నేతలు అనేక వ్యాపారాలున్నా.. ఎవరికీ రాని నష్టం ప్రభుత్వ సంస్థలకు మాత్రమే ఎందుకు వస్తుందనేది ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన అవసరం ఉంది.

దీనికి తోడు వారం రోజుల క్రితం ఆర్టీసీ వైస్‌ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్‌వీ సురేంద్రబాబు మాట్లాడుతూ ఆర్టీసీ నష్టాలను తగ్గించుకోవడానికి టికెట్ ధరలు పెంచడం తప్ప వేరే దారిలేదని ప్రకటించారు. దేశంలోనే అత్యధిక ధరలు చెల్లిస్తున్న ఏపీ ప్రజలకు ఇది మరో శరాఘాతం. ప్రభుత్వ దుబారా చర్యలు అరికట్టలేని సిన్సియర్ ఐపీఎస్ ఆఫీసర్ సురేంద్రబాబు ప్రజల నడ్డి విరుస్తానికి మరోమారు సంసిద్ధత వెలిబుచ్చడం గమనార్హం.

ఇది ఇలా ఉండగా,ఫిబ్రవరి 5న కార్మిక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఇచ్చిన హామీ మేరకు వేతన సవరణ బకాయిలు చెల్లించాలని ఎన్ని సార్లు మొరపెట్టినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో ఈనెల 9న ఆర్టీసీ ఎండీ, కమిషనర్‌లకు సమ్మెనోటీసు ఇవ్వనున్నట్లు ఆర్టీసీ జేఏసీ ప్రకటించింది. దీంతోపాటు ఆర్టీసీలో అద్దె బస్సుల పెంపును కూడా విరమించుకోవాలని ఆ సంఘం కోరుతోంది. ఇదే సమయంలో సిబ్బందిని తగ్గించడంపై ఆర్టీసీ కార్మికులు మండిపడుతున్నారు. ఏతావాతా ప్రభుత్వ అసమర్థతకు సంస్థతోపాటు, ప్రయాణీకులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ సమస్యను సామరస్యంగా పరిష్కరించి,ఆర్టీసీకి ప్రాణ ప్రతిష్ట చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## ప్రతిపక్షాల అనైక్యతపై మోదీ ఆశలు

**(మొదటిపేజీ తరువాయి)**

ప్రభుత్వం ఏర్పాటుచేసే అవకాశాలు మెరుగు అవుతాయి.

కాని పక్షంలో ఎన్డియే కూటమి ఏకైక పెద్ద కూటమిగా నిలిచే అవకాశం ఉంది. అయినా ప్రభుత్వం ఏర్పాటుకు సరిపడా స్థానాలు రాకపోవచ్చు. ఈ పరిస్థితిని అధిగమించడానికి చిన్న పార్టీలపై – ఆఖరికి ఒక సీటు గెలిచే అవకాశం ఉన్న పార్టీలపై మోదీ దృష్టి సారించారు.

ఎలాగైనా మరోసారి ప్రధాని పీఠం దక్కించుకొనడానికి ప్రధాని మోదీ ఏ ఒక్క అవకాశం విడిచిపెట్టకుండా ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికల ముందు రైతులతో సహా వివిధ వర్గాలకు తాయిలాలు ప్రకటించారు.తాను వెనుకబడిన వర్గాలకు సంభందించిన వాడినని చెప్పుకుంటూ బిసి ఓట్లకు గాలం వేస్తున్నారు. ఎన్డియే, యూపీఏ కూటములలో లేని పార్టీలపై, నాయకులపై మోదీ ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. భేషజాలకు పోకుండా తమిళనాడులో ఐదు సీట్లతో అన్నా డీఎంకే తో పొత్తు కుదుర్చుకున్నారు. దక్షణ భారతంలో భాజాపాకు బలం లేనందున ఆంధ్రప్రదేశ్‌లో వైకాపా తెలంగాణా లో తెరాసతో లోపాయకారి అవగాహనకు వచ్చి కేంద్రం నుంచి ఈ రెండు పార్టీలకు రాజకీయంగా సహకరించడానికి చర్యలు తీసుకున్నారు. ఒక్క సీటు ఉన్న పార్టీలు కూడా ఎన్డియే లో చేర్చుకునేందుకు సిద్ధమని మోదీ చెబుతున్నారు.

2004 లో 141 స్థానాలలో గెలిచి అధిక స్థానాలు గెలుచుకున్న పెద్ద పార్టీగా కాంగ్రెస్ నిలిచింది. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి మరో 130 స్థానాలు రావలసి ఉన్నా ఇతర పక్షాలను కలుపుకొని యూపీఏ గా ఏర్పడి కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం ప్రధాని మోదీ, భాజాపా అధ్యక్షుడు అమిత్ షా దృష్టి లో ఉంది. ప్రభుత్వ ఏర్పాటుకు 273 మ్యాజిక్ ఫిగర్. కాంగ్రెస్ కు 2004 లో వచ్చిన 141 స్థానాలకు మించే భాజాపాకు స్థానాలు లభిస్తానని మోదీ, అమిత్ షాల అంచనా. ప్రతిపక్ష పార్టీలలో చీలికను తెచ్చే అవకాశాలను వీరు పరిశీలిస్తునారు. ప్రతిపక్ష పార్టీలలోని నాయకులూ కూడా మోదీ, షా ల ప్రయత్నాలను గమనిస్తున్నారు. ఎవరు పై చేయి సాధిస్తారనే విషయం ఫలితాల తర్వాత వారి వారి సంఖ్యాబలాలను బట్టి ఆధారపడి ఉంటుంది.

మరొకవైపు ప్రతిపక్షాలలో అనైక్యత పైనా మోదీ దృష్టి సారించారు. కాంగ్రెస్ నాయకత్వంలోని కూటమి అధికారం చేపట్టడం పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, బిస్పి అధినేత్రి మాయావతికి ఇష్టం లేదు. ఈ పరిస్థితి మోదీ, అమిత్ షా ఆశలకు ఊపిరి పోస్తున్నాయి. డెబ్బై, ఎనభై దశాబ్దాలలో ప్రతిపక్షాల అనైక్యత వల్లే ఇందిరా గాంధీ ఎక్కువకాలం ప్రధాని పదవిలో కొనసాగిన విషయం మోదీ దృష్టి లో ఉంది. పలు బహిరంగ సభలలో మోదీ చేస్తున్న ప్రసంగాలు ప్రతిపక్షాల అనైక్యతపై గతంలో ఇందిరా గాంధీ చేసిన ప్రసంగాలను తలపిస్తున్నాయి. నెహ్రూ కుటుంబాన్ని తీవ్రంగా వ్యతిరేకించే మోదీ గతంలో ఇందిరాగాంధీ బాటనే అడుగులు వేయడం పరిశీలకులు గమనించారు.

## ఎన్ఆర్ఐ జనరల్ హాస్పిటల్ ప్రాథమిక చికిత్సా కేంద్రం ప్రారంభం

**(మొదటిపేజీ తరువాయి)**

అభినందించారు. డా॥ మని అక్కినేని మాట్లాడుతూ గర్భిణీ స్త్రిలకు కేర్ ఇక్కడ జరిగి డెలివరీకి ఎన్ఆర్ఐ హాస్పిటల్ పంపించే విధంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. అంతేకాకుండా ఇలాంటి ప్రాథమిక చికిత్సా కేంద్రాలను ఎన్ఆర్ఐ ఏర్పాటు చేయటం వల్ల స్థానిక ప్రజలకు సేవలందించటంతో పాటు మా కాలేజీలో చదివే వైద్యవిద్యార్థులను మంచి డాక్టర్లుగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉంటుందని డా॥ మని తెలిపారు. మందడం గ్రామ ప్రజలు, ఆలూరు కుటుంబాలు అందరూ కలిసి ఈ భవనాన్ని ప్రజలకు ఉపయోగపడేవిధంగా ఇవ్వాలని హాస్పిటల్ అయితే బాగుంటుందని, ఉచితంగా ప్రజలకు వైద్యసేవలు అందించవచ్చని ఈ భవనాన్ని ఇచ్చామనిడా॥ ఆలూరు ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డా॥ వివి సుబ్బారావు, డా॥ సాయి, తదితరులు పాల్గొన్నారు.

## సమ్మర్ స్పోర్ట్స్ కోచింగ్ క్యాంపు విజయవంతం




**రాజధాని వార్తలు, అమరావతి :** క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో అవసరమన్న చెస్ గ్రాండ్ మాస్టర్ లలిత్ బాబు వి.ఐ.టి.–ఏ.పి విశ్వవిద్యాలయం దత్తత గ్రామాలైన ఐనవోలు, శాఖమూరు, వెలగపూడి గ్రామాలకు సంబందించిన విద్యార్థులకు రెండవ వార్షిక ఉచిత సమ్మర్ స్పోర్ట్స్ కోచింగ్ క్యాంపును విశ్వవిద్యాలయ వైస్ ప్రెసిడెంట్ శంకర్ విశ్వనాథన్ గారు ఏప్రిల్ 25న ప్రారంభించారు. 2018 సంవత్సరంలో మొదటి కోచింగ్ క్యాంపు కు 458 విద్యార్థులు హాజరుకాగా, ఈ సంవత్సరం 552 మంది విద్యార్థులు హజరై తమ క్రీడా నైపుణ్యాలను పెంపొందించుకున్నారు. వి.ఐ.టి.–ఏ.పి విశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంటు అధ్వర్యంలో ఈ సమ్మర్ స్పోర్ట్స్ కోచింగ్ క్యాంపు నిర్వహించటం జరిగింది. ఈ శిబిరం ఏప్రిల్ 25 నుండి మే 4 వరకు నిర్వహించటం జరిగింది. ఈ శిబిరంలో బాస్కెట్ బాల్, వాలీ బాల్, కబడ్డీ, యోగ, అథ్లెటిక్స్, త్రో బాల్, కరాటే, ఫుట్ బాల్ మరియు బాడ్మింటన్ క్రీడలలో ఉదయం 7 గంటల నుండి గం॥ 8.30 నిమిషాల వరకు శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ శిబిరం కొరకు విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కూడా ఏర్పాటు చేయటం జరిగింది. ఈ శిబిరం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చెస్ గ్రాండ్ మాస్టర్ మరియు కామన్వెల్త్ గోల్డ్ మెడలిస్ట్ అయిన ముసునూరి రోహిత్ లలిత్ బాబు విచ్చేసారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పటు క్రీడలు ఎంతో అవసరమని, విద్యార్థులు రోజు వ్యాయామం చెయ్యాలని సూచించారు. విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డా॥ డి. శుభాకర్ మాట్లాడుతూ క్రీడల వల్ల ప్రాబ్లం సాల్వింగ్, నాయకత్వ లక్షణాలు, టీం స్కిల్స్ పెంపొందుతాయని అవి ఈ కాలంలో ఎంతో అవసరమని అన్నారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా॥ సి.యల్.వి శివకుమార్ గారు మాట్లాడుతూ మా దత్తత గ్రామాలలోని విద్యార్థులకు ఈ సమ్మర్ స్పోర్ట్స్ కోచింగ్ క్యాంపు ఎంతగానో ఉపయోగపడుతుందని, ఈ శిబిరంలో విద్యార్థులకు బ్రెడ్, 200 ml పాలు, కోడిగ్రుడ్డు, అరటి పండు అందించామని తెలిపారు. విశ్వవిద్యాలయ ఫిజికల్ డైరెక్టర్ డా॥ డి. కాళిదాస్ ఈ సమ్మర్ స్పోర్ట్స్ కోచింగ్ క్యాంపుని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

## అభిరుచి మధుకి సన్మానం

**రాజధాని వార్తలు, మంగళగిరి :** ప్రపంచంలోనే అతి ప్రతిష్టాత్మకమైన ఆంద్రూస్ థియోలాజికల్ యూనివర్సిటీ (యూఎస్ఎ) వారు ఢిల్లీలోని వైయంసిఎ హాలు నందు జార్జ్ కురియన్ వైస్ ఛైర్మెన్ నేషనల్ కామోషన్ ఫర్ మైనారిటీస్ అఫ్ ఇండియా వారి చేతుల మీదుగా గుండాల మధుసూదనరావు (అభిరుచి మధు) గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. మధు గారికి డాక్టరేట్ ఇచ్చిన సందర్భంగా అభిరుచి మధు మిత్ర మండలి వారు ఆదివారం ఉదయం కమ్మ భవన్ హ్యాపీ రిసార్ట్స్‌లో సన్మాన కార్యక్రమం జరుగును. ఈ కార్యక్రమానికి అభిరుచి సేవా సంస్థల కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కమ్మ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అధ్యక్షులు సుంకర వెంకట రమణ కోరారు.

## కెనడా ప్రభుత్వంలో తెలుగు మంత్రులు

- ఇన్‌ఫ్రా మంత్రిగా ప్రసాద్ పండా
- లీలా అహీర్‌కు సాంస్కృతిక శాఖ




**రాజధాని వార్తలు, డెస్క్ :** కెనడాలో ఇద్దరు తెలుగు వారికి అరుదైన గౌరవం దక్కింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రసాద్ పండా, లీలా అహీర్.. కెనడా ప్రభుత్వంలో మంత్రులుగా చోటు దక్కించుకున్నారు. కాల్గరి–ఎడ్జ్‌మెంట్ నియోజకవర్గం నుంచి ప్రసాద్ కెనడా చట్టసభకు ఎన్నికయ్యారు. 2015లో ఈ స్థానానికి జరిగిన ఉపఎన్నికల్లో ఆయన వైల్డ్‌రోజ్ పార్టీ నుంచి గెలిచారు. అయితే ఇటీవలి ఎన్నికల్లో కన్సర్వేటివ్ పార్టీలన్నీ ఒక్కతాటిపైకి రావడానికి కృషిచేసిన ప్రసాద్ ఈ ఎన్నికల్లో యునైటెడ్ కన్జర్వేటివ్ పార్టీ అభ్యర్థిగా విజయం సాధించారు. ఆయన చేసిన రాజకీయ కృషిని గుర్తించి కెనడా ప్రభుత్వంలో కీలకమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మంత్రిగా అవకాశం కల్పించారు. కాల్గరి తెలుగు అసోసియేషన్‌కు మొదటి ఉపాధ్యక్షుడిగా పనిచేయడంతో పాటు, చట్టసభల్లో పలు కమిటీల్లో ఉండి ప్రసాద్ సేవలందించారు.

ప్రసాద్ స్వస్థలం గుంటూరు జిల్లా సంగం జాగర్లమూడి. మెకానికల్ ఇంజనీరింగ్ చేసిన ఆయన ఎనర్జీ రంగంలో 28 ఏళ్లు పనిచేశారు. ఆ తర్వాత రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. కెనడా రాజకీయాల్లో బిజీగా ఉన్నప్పటికీ ఆయన తరచూ ఆంధ్రప్రదేశ్‌కు కూడా వస్తుంటారు. కాగా.. విజయనగరం జిల్లాకు చెందిన లీలా అహీర్ తాజా ఎన్నికల్లో ఎడ్‌మోంటన్–చెస్టర్‌మేర్ నియోజకవర్గం నుంచి కెనడా చట్టసభకు ఎన్నికయ్యారు. సామాజిక సేవలో చురుగ్గా పాల్గొనే ఆమెకు సాంస్కృతిక, మహిళా సంక్షేమ శాఖ అప్పగించారు. లీలా తండ్రిది విజయనగరం. ఈ ఏడాది సంక్రాంతికి విజయనగరం వచ్చి తండ్రిని చూసి వెళ్లారు. పంజాబ్‌కు చెందిన వ్యక్తిని ఆమె వివాహం చేసుకున్నారు. ఈ సందర్భంగా తెలుగు వారు మంత్రులు అవ్వడం ఆనందంగా ఉందని ఏపీఎన్నార్టీ అధ్యక్షుడు డా. వేమూరు రవికుమార్ తెలిపారు.


## బీజేపీ ఎమ్మెల్యే కండకావరం ముస్లింలకు తిండి దండగ..

**రాజధాని వార్తలు, దిస్‌పూర్ :** సార్వత్రిక ఎన్నికల వేళ అస్సాం బీజేపీ ఎమ్మెల్యే ప్రశాంత ఫకాన్ ముస్లిం వర్గాలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. వారు పాలిచ్చే గోవులు కాదని, అలాంటప్పుడు తిండి దండగే కదా అని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ, ముస్లిం వర్గాలు తీవ్రంగా మండిపడ్డాయి. ఫకాన్‌పై చర్యలు తీసుకోవాలని శాసనసభలో ప్రతిపక్ష నేత దేవవ్రత సైకియా స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ముస్లిం ఓట్లతో పనిలేదన్న బీజేపీ ఎమ్మెల్యే.. అధికారంలోకి వచ్చాక వారి సంక్షేమం కోసం తమ ప్రభుత్వం పనిచేయదని కూడా అన్నారని స్పీకర్ దృష్టికి తీసుకొచ్చారు. ఇదిలాఉండగా.. ఎమ్మెల్యే ఫకాన్ తన వ్యాఖ్యలకు వివరణ ఇచ్చుకున్నారు.'90 శాతం ముస్లింలు మాకు ఓటేయరు. అందుకనే అస్సామీ సామెతను ఉటంకిస్తూ ముస్లిం ఓటర్ల గురించి అలా మాట్లాడాను. 90 శాతం హిందువులు మా పార్టీకి ఓటేస్తారు. అందుకే అలా మాట్లాడాను. అంతేగాని నేను ఎవరినీ ఎవరితో ఎవరినీ పోల్చలేదు' అని ఫకాన్ చెప్పుకొచ్చారు.

## జూన్ 13-18 వరకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసెస్ కమీషన్ పరీక్షలు


**రాజధాని వార్తలు, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసెస్ కమీషన్ డిపార్ట్‌మెంటల్ పరీక్షలను జూన్ 13 నుండి జూన్ 18–2019 వరకు నిర్వహించనున్నారు. అప్లికేషన్‌లను మే 6 నుండి 21వ తేదీ వరకు ఇవ్వనున్నారు. వివరాలకు www.psc.ap.gov.in లో చూడవచ్చు.

## రీ పోలింగ్‌కు పటిష్ట భద్రత : ద్వివేది



**రాజధాని వార్తలు, అమరావతి :** రాష్ట్రంలో రీపోలింగ్ జరిగే ఐదు బూత్‌లను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించి, వాటివద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయనున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి గోపాలకృష్ణ ద్వివేది తెలిపారు. గుంటూరు జిల్లాలో రెండు, ప్రకాశంలో ఒకటి, నెల్లూరు జిల్లాలో రెండు చోట్ల ఈనెల 6న పోలింగ్‌కు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించిన సంగతి తెలిసిందే. గుంటూరు జిల్లాలో ఒకచోట శాంతిభద్రతల సమస్య, మరోచోట ఈవీఎం మొరాయించడంతో రీపోలింగ్‌కు ఈసీఐ అనుమతి కోరినట్లు ద్వివేది తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని నల్లచెరువు బూత్ నంబరు 244లో శాంతి భద్రతల సమస్య తలెత్తిందని, అలాగే నరసరావుపేట నియోజకవర్గం కేసానుపల్లి గ్రామంలో 94వ బూత్‌లో, ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని కలనూతలలోని 247వ బూత్‌లో ఈవీఎం స్లీపింగ్ మోడ్‌లోకి వెళ్లిపోవడంతో, నెల్లూరు జిల్లాలో పోలింగ్ సిబ్బంది చేసిన పొరపాటుతో తిరుపతి పార్లమెంటు పరిధిలో మాత్రమే రెండు బూత్‌లలో రీపోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొవ్వూరు అసెంబ్లీ సెగ్మెంట్‌పరిధిలో ఇసుకపల్లిపాలెంలోని బూత్ నంబర్ 41, సూళ్లూరుపేట సెగ్మెంట్ పరిధిలో అటకానితిప్ప బూత్ నంబరు 197లో కేవలం పార్లమెంటు స్థానానికి మాత్రమే రీపోలింగ్ నిర్వహించనున్నారు. రీపోలింగ్‌కు కావాల్సిన అదనపు ఈవీఎంలు, వీవీప్యాట్, బెల్ ఇంజనీర్లను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ఈ బూత్‌లలో సీసీ కెమేరాలను ఏర్పాటు చేసి పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు పరిశీలించనున్నట్లు ద్వివేది వివరించారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందని ఆయన తెలిపారు.

## రాష్ట్రంలో మళ్లీ తెదేపా ప్రభుత్వమే



**సీఎం చంద్రబాబు నాయుడు ధీమా**

**రాజధాని వార్తలు, అమరావతి :** ఈ ఎన్నికల సమయంలో ఎంతోమంది విలన్లను తట్టుకొని నిలబడ్డామని తెదేపా జాతీయ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రంలో మళ్లీ తెదేపా ప్రభుత్వమే వస్తుందని నేతలకు స్పష్టంచేశారు. సార్వత్రిక ఎన్నికలపై అమరావతిలోని హ్యాపీ రిసార్ట్స్‌లో తెదేపా సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు పలు అంశాలపై పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ యంత్రాంగం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తెదేపాకు వ్యతిరేకంగా మోదీ, కేసీఆర్ అనేక కుట్రలు చేశారని చంద్రబాబు మండిపడ్డారు.

మనలాంటి పార్టీ దేశంలో ఎక్కడా లేదు!

"ఎన్నికలకు ముందు ప్రజలందరి అభిప్రాయాలూ తీసుకున్నాం. మన పార్టీకి వ్యతిరేకంగా ప్రత్యర్థులు పన్నిన కుట్రలను పోటాపోటీగా ఎదుర్కొన్నాం. కార్యకర్తలతో మమేకమయ్యే తెదేపాలాంటి పార్టీ దేశంలో ఎక్కడా లేదు. రాష్ట్రాన్ని ఇబ్బంది పెట్టాలని మోదీ ప్రయత్నాలన్నీ చేశారు. తెదేపాకు ఏదోలా నష్టం కలిగించాలనేదే భాజపా ధ్యేయం. తెదేపాకు నష్టం కల్గించేందుకు కేసీఆర్ కూడా ప్రయత్నించారు. రాష్ట్రంలో జగన్ కుట్రలకు మోదీ, కేసీఆర్ కుతంత్రాలు తోడయ్యాయి. ఎందరు ఇబ్బందులు పెట్టినా ప్రజలు తెదేపా వెంటే ఉన్నారు. ప్రమాణాలు, ముహూర్తాలు, మంత్రి పదవులంటూ వస్తోన్న వార్తలన్నీ మైండ్‌గేమ్‌లో భాగమే. రాష్ట్రంలో ఓటింగ్ శాతం తగ్గించేందుకు కుట్రలు పన్నారు. ఆ కుట్రలు తెలిసే ఓటింగ్‌కు తరలిరావాలని ప్రజలకు నేను పిలుపునిచ్చాను. రాష్ట్రంలో తెదేపా విజయంపై సందేహం లేదు. సీట్లు, ఆధిక్యతపైనే దృష్టి ఉంది. భవిష్యత్తులో జరిగే ప్రతి ఎన్నికలోనూ తెదేపానే గెలవాలి. నేను వాస్తవికత ప్రాతిపదికగానే మాట్లాడాతా. పనిచేస్తా" అని చంద్రబాబు అన్నారు.

**తొలి దశలో ఎన్నికలతో మేలే జరిగింది!**

"రాష్ట్రంలో తొలి దశలోనే ఎన్నికలు పెట్టడం తెదేపాకు మేలు చేసింది. ఓటర్లు ఏపీకి రాకుండా కేసీఆర్ కుట్రలు పన్నారు. ఓటర్లు ఓటు వేయకుండా అనేక ప్రయత్నాలు చేశారు. సొంత వాహనాల్లో వచ్చి మరీ పట్టుదలతో ఓటర్లు ఓట్లు వేసి వెళ్లారు. ఎన్నికల్లో అనేక మంది విలన్లను తట్టుకుని నిలబడ్డాం. తెలంగాణ కంటే మన ఆంధ్రప్రదేశ్ అనేక రంగాల్లో ముందుంది. అధికారుల్లో చీలిక తెచ్చే ప్రయత్నాలు మంచివి కాదు. రాష్ట్రాభివృద్ధికి కలిసికట్టుగా పనిచేయాలనేదే నా సంకల్పం" అని చెప్పారు.

# న్యాయం పొందడమే నా లక్ష్యం

**న్యాయం పొందడమే నా లక్ష్యం .. పగ సాధించడం కాదు.. సుదీర్ఘ న్యాయపోరాటంలో నేనెప్పుడూ భారత రాజ్యాంగంపై నమ్మకం కోల్పోలేదని స్థిరంగా చెబుతున్నారు 2002 గుజరాత్ మతకలహాల బాధితురాలు బిల్కీస్ బానో.**

ఆమె

17 ఏళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత ఆమెకు న్యాయం చేయమని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇందులో భాగంగా రూ. 50లక్షలతోపాటు, ఇల్లు, ప్రభుత్వ ఉద్యోగం కూడా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ఆ దారుణ మారణకాండలో ఆమె తన సర్వస్వాన్ని కోల్పోయింది. కుటుంబంలోని 14 మందిని, రెండేళ్ల కూతుర్ని, అల్లరిమూకలు హత్య చేయగా, ఐదునెలల గర్భవతి అయిన ఆమెను ఇంటిపక్క హిందూ మతోన్మాదులు అత్యాచారం చేసి పొదల్లో పడేశారు. తనకు కలిగిందంతా కోల్పోయేలా చేసినందునే తనను తాను నిరూపించుకునేందుకు సిద్ధ పడ్డానని ఆమె చెబుతున్నారు. ఇన్నేళ్లూ, బాధ, భయంతో పిల్లలతో అనేక చోట్లకు తిరిగానని సుప్రీం తీర్పుతో సొంత ఇల్లు రావడం సంతోషంగా ఉందని, ఇకపై పిల్లలతో ఒకే చోట ఉండబోవడం ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. ఆమెలా అన్యాయానికి, అధర్మానికి బలైపోయిన మహిళలకు న్యాయం కలగాలని ఆమె కోరుకుంటున్నారు. పిల్లలను విద్యావంతులను చేయడం ద్వారా చట్టబద్ధంగా తమను తాము రక్షించుకునే అవకాశం ఉంటుందన్నారు. తనకు ప్రభుత్వం అందించే నష్టపరిహారంతో మారణకాండ బాధితులకు, హత్య చేయబడిన తన కూతురు పేరుతో పేదలకు చదువు చెప్పిస్తానని, తద్వారా తన కూతురు సలేహ బ్రతికే ఉంటుందన్నారు. కేసులో విజయం సాధించిన తర్వాత ఆమె భర్త యాకూబ్, చిన్నకూతురుతో కలసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశానికి మహిళా, మానవ హక్కుల సంఘాలు పాల్గొని ఆమె సుదీర్ఘపోరాటాన్ని ప్రశంసించాయి. విద్వేష ప్రసంగాలు దేశాన్ని అల్లకల్లోల పరిచినప్పుడు బానో విజయాన్ని గుర్తు చేసుకోవాలని ఆయా సంఘాలు కోరాయి. దేశంలోని పౌరులందరికీ సమాన న్యాయం అమలు అయినప్పుడే రాజ్యాంగ విలువలు పెరుగుతాయన్నారు. తాను నష్టపరిహారం కోసం న్యాయపోరాటం చేయలేదని, భారతీయ పౌరురాలిగా హక్కును వినియోగించుకున్నానని బానో వెల్లడించారు. చట్టం ముందు అన్ని రాష్ట్రాలు సమానమని సుప్రీంకోర్టు తీర్పు వెల్లడించిందన్నారు. బానోతోపాటు సుప్రీంకోర్టులో ఆమెకేసును వాదించిన లాయర్ శోభన కూడా మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈకేసు విజయం సామాన్యులకు న్యాయవ్యవస్థపై గౌరవం కలిగిస్తుందని, రాజ్యాంగం ముందు అందరూ సమానమేనన్న భావనను సుప్రీంకోర్టు తీర్పు ద్వారా తెలియజెప్పిందన్నారు. జీవించే హక్కును కాలరాసి, దేశ



సమగ్రతకు భంగం కలిగించే శక్తులకు భంగపాటుతప్పదని అత్యున్నత కోర్టు వెల్లడించిందని శోభన అన్నారు. సుప్రీంకోర్టు అండగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రభుత్వం అందించే నష్టపరిహారంతో ఆమెలా అన్యాయానికి గురైన వారి కోసం వినియోగిస్తానని బిల్కీస్ బానో స్పష్టం చేశారు.

# అహంకారం లేని నాయకులకే ఓటర్ల పట్టం



రుచిర్ శర్మ

**రాజధాని వార్తలు :** భారత ఓటర్లు ఏం కోరుకుంటున్నారు ? బలమైన నాయకత్వమా ? ప్రజాస్వామ్యమా అనేదానిపై 'ది న్యూయార్క్ టైమ్స్' వార్తాపత్రిక కాలమిస్టు రుచిర్ శర్మ డెమొక్రసీ ఆన్ ది రోడ్‌లో వివరించారు. ఇందుకోసం 1998 నుంచి భారత్‌లో ఎన్నికల సమయంలో 27 సార్లు ఆయన దేశవ్యాప్తంగా పర్యటించారు. భారత్‌లోని 29 రాష్ట్రాల్లో సగానికి పైగా రాష్ట్రాల్లో తిరిగారు.జనాభా అధికంగా ఉన్న, రాజకీయంగా ముఖ్యమైన 10 రాష్ట్రాల్లో ఒకటి కంటే ఎక్కువసార్లే పర్యటించారు.

బలమైన నాయకుడిని ప్రజలు కోరుకొంటున్నారని సర్వేలు కొన్నిసార్లు అనిపిస్తున్నా భారత ఎన్నికల వాస్తవ సరళిని చూస్తే, ఈ వాదన వాస్తవం కాదనిపిస్తోందని రుచిర్ శర్మ అభిప్రాయపడ్డారు. అహంకారంలేని నాయకుల వైపే భారతీయులు మొగ్గు చూపుతుంటారని చెప్పారు."భారతీయుల ప్రజాస్వామ్య కాంక్ష బలమైనది. ఎవరైనా నాయకుడు అహంకారంతో వ్యవహరిస్తే, ప్రజలు గద్దె దించుతారు. అన్నింటికన్నా ముఖ్యమైన విషయమేంటంటే– అసాధారణ వైవిధ్యమున్న ఈ దేశంలో ఒకే నాయకుడు సుదీర్ఘ కాలం ఆధిపత్యం సాగించడం కష్టం" అని రుచిర్ శర్మ వ్యాఖ్యానించారు.

భారత్ ఒక బహుళ జాతి సంగమం.. 29 భారత రాష్ట్రాలను 14 ఉప ప్రాంతాలుగా వర్గీకరించి చూస్తుందని, దేశంలో ప్రజల అభిరుచులు, అలవాట్లు, భాషలు అనేక రకాలుగా ఉంటాయని ఆయన వివరించారు.'భారత ప్రజాస్వామ్య నిజమైన బలం భిన్నత్వంలోనే ఉంది" అని రుచిర్ శర్మ వ్యాఖ్యానించారు.ప్రధాని మోడీ తనను తాను బలమైన నాయకుడిగా చెప్పుకొంటున్నప్పటికీ, నిజానికి భారత ప్రజానీకం కోరుకొనేది బలమైన నాయకులను కాదనే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తంచేశారు.

'2019 ఎన్నికలను మోడీ, మిగతా నాయకుల మధ్య పోటీగా చూస్తున్నారు. బలమైన నాయకులపై భారతీయుల ఆసక్తి, ప్రజాస్వామ్య పరిరక్షణకు కట్టుబడి ఉండటంపై రెఫరెండంగా చూస్తున్నారు. వాస్తవానికి ఈ ఎన్నికలు ఆయా రాష్ట్రాల్లో జరిగే వేర్వేరు పోటీలుగా సాగే అవకాశమే ఎక్కువ" అని రుచిర్ శర్మ విశ్లేషించారు. ఆయన వాదనకు బలం కూర్చే విధంగా లోక్‌సభలో మొత్తం 543 స్థానాలు ఉండగా, 160కి పైగా స్థానాల్లో ప్రాంతీయ పార్టీలే విజయం సాధిస్తున్నాయి. అంటే మొత్తం స్థానాల్లో దాదాపు మూడో వంతు సీట్లను ఇవే గెలుచుకొంటున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలి దశలో కేవలం 35 సీట్లే వీటికి దక్కేవి.

ఇదో ప్రధానమైన మార్పు అని, దీనివల్లే భారత సార్వత్రిక ఎన్నికలు రాష్ట్రస్థాయి ప్రాంతీయ లేదా ఉప జాతీయ(సబ్ నేషనల్) ఎన్నికల సమాహారంగా మారిపోయాయని ప్రముఖ సెఫాలజిస్టు (ఎన్నికల విశ్లేషకులు), జర్నలిస్టు ప్రణయ్ రాయ్ చెబుతున్నారు.

2014 ఎన్నికల్లో బీజేపీ సొంతంగా 280కి పైగా స్థానాలు తెచ్చుకోవడం చరిత్రాత్మకమైన విజయం. కానీ చాలా మంది ద ృష్టిలో అది అనూహ్యమైన పరిణామం.'2014లో మోడీ హవా ఉన్నప్పుడు సాధించినట్లుగానే ఈసారి కూడా బీజేపీ మూడో వంతు ఓట్లు తెచ్చుకోగలదు, కానీ మెజారిటీ సీట్లు కోల్పోతుంది" అని రుచిర్ శర్మ అభిప్రాయపడ్డారు. సాధారణంగా అధికార పక్షాలు మళ్లీ విజయం సాధించవు, ప్రతిపక్షాలు విజయం సాధిస్తాయని చెప్పారు. బహుముఖ పోటీ ఉన్న రాష్ట్రాల్లో జరిగే ఎన్నికల్లో చాలా సందర్భాల్లో కేవలం మూడో వంతు ఓట్లతోనే పార్టీలు మెజారిటీ సీట్లను సాధిస్తుంటాయి.1977 నుంచి 2002 మధ్య పెద్ద, మధ్యస్థ రాష్ట్రాల్లో నూటికి 70 సందర్భాల్లో పాలక పక్షాలు ఓడిపోయాయని ప్రణయ్ రాయ్ అధ్యయనంలో తేలింది. ఇప్పుడు పరిస్థితులు మారాయని, పాలక పక్షాలు తిరిగే ఎన్నికయ్యే అవకాశాలు 50 శాతం ఉన్నాయని ఆయన చెప్పారు.

**'అధికారం దక్కించుకోవడం చాలా కష్టం'**

భారత రాజకీయాల్లో అధికారాన్ని దక్కించుకోవడం చాలా కష్టమని, దక్కిన అధికారం నిలబడేదీ తక్కువ కాలమేనని ప్రణయ్ రాయ్ అధ్యయనంలో స్పష్టమైంది.అభ్యర్థులు కులం, కుటుంబం, ధరల పెరుగుదల, సంక్షేమం, అభివృద్ధి, అవినీతి లాంటి అంశాల్లో పరీక్షను ఎదుర్కోవాల్సి వస్తుంది. భారత రాజకీయ డీఎన్ఏలోనే మౌలికంగా సామ్యవాద(సోషలిస్ట్), రాజ్యవాద(స్టేటిస్ట్) భావనలు ఇమిడి ఉన్నాయని రుచిర్ శర్మ వ్యాఖ్యానించారు.

ప్రజల్లో మోడీ తాము ఆశించినంత సంస్కరణవాది కాదనే అసంతృప్తి ఉందని, మంచి ఆర్థిక విధానాలు ఎప్పటికైనా ఎన్నికల్లో సుస్థిరమైన గెలుపు వ్యూహాలుగా మారుతాయనే సూచనలు కనిపించడం లేదు" అని ఆయన వివరించారు.పెరుగుతున్న జాతీయవాదం, మత రాజకీయాలు ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేస్తున్నాయనే ఆందోళన నిరాధారమైనదని ఆయన అభిప్రాయపడ్డారు. భారత్‌లో భిన్నత్వం చాలా ఎక్కువని, ఇక్కడ ప్రజాకర్షక జాతీయవాదంతో ఆధిపత్యం చలాయించడం సాధ్యం కాదని తెలిపారు. జాతీయవాదం నుంచి ముప్పు ఏర్పడకుండా నిలువరించగల ప్రాంతీయవాద భావనలు దేశంలో ఉన్నాయన్నారు."2019 ఎన్నికలు రెండు వేర్వేరు రాజకీయ లక్ష్యాలను భారతీయుల ముందుంచుతున్నాయి. ఒకటేమో దేశంలోని భిన్నత్వాన్ని గుర్తించి, గౌరవించాలనే లక్ష్యం. మరొకటి– ఈ భిన్నత్వాన్ని పరిగణనలోకి తీసుకోని విరుద్ధమైన భావన" అని రుచిర్ శర్మ అభిప్రాయపడ్డారు. ఏది ఏమైనా భారత్‌ది బహుళ సంస్కృతి, నిరహంకారులకే ఇక్కడ పట్టం కడతారని ఆయన స్పష్టం చేశారు.

## ప్రపంచ శాంతి కోసం రంజాన్ ప్రార్థనలు



**రాజధాని వార్తలు, అమరావతి :** ప్రపంచ శాంతికోసం రంజాన్ ప్రార్థనలు జరపనున్నారు. ఈనెల 5నుంచి రంజాన్ మాసం ఆరంభం కానుంది. పండుగ, పర్వదినం అంటే శుభవేళ, ఉత్సవ సమయం అని అర్థం. పండుగలు మన జీవన ప్రవంతిలో భాగమై మన జాతీయతకు, సంస్కృతీ వికాసానికి దోహదం చేస్తూ ఉన్నాయి. ' పండుగ ' అనేది ఏ మతానికి సంబంధించినదైనా సరే.. దాని వెనుక ఒక సందేశం దాగి వుంటుంది. 'పండుగ' మానావాళికి హితాన్ని బోధిస్తుంది. ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకునే ' రంజాన్' పండుగ సైతం ఇదే హితాన్ని మానవాళికి అందిస్తుంది.ముస్లింలు చాంద్రమాన కేలండర్ను అనుసరిస్తారు. చాంద్రమానాన్ని అనుసరించే ఇస్లామీయ కేలండర్ తొమ్మిదవ నెల 'రంజాన్', దీనిని ముస్లింలు అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. దానికి ప్రధానమైన కారణం ' దివ్య ఖురాన్' గ్రంథం ఈ మాసంలో అవిర్భవించడమే! క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే ' రంజాన్ మాసం'

**ఉపవాస వ్రతం**

ఖురాన్ ప్రకారం రంజాన్ నెలలో విధిగా ఆచరించవలసిన నియమం ' ఉపవాసవ్రతం'. ఈ ఉపవాసాన్ని పార్సీ భాషలో 'రోజా' అని అంటారు. అరబ్బీ భాషలో సౌమ్ అని పిలుస్తారు. ఈ ఉపవాస విధిని గురించి దివ్యఖురాన్ గ్రంథం.విశ్వాసులారా! గత దైవ ప్రవక్తలను అనుసరించే వారికి ఎలా ఉపవాసాలు విధిగా నిర్ణయించబడ్డాయో... అలాగే మీలో భయభక్తులు జనించిడానికి అదేవిధంగా ఇప్పుడు మీకు కూడా ఉపవాసవ్రతాలు నిర్ణయించబడ్డాయి' అని పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిన ఉగ్రవాదం అంతం మొంది, ఎల్ల ప్రజలు శాంతి, సౌభాగ్యాలతో వర్థిల్లేలా అల్లాహ్ కరుణ జూపాలని ఉపవాస ప్రార్థనల్లో కోరుకుందాం..

## విట్‌లో యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్ కోర్సుల ప్రారంభం



**రాజధాని వార్తలు, అమరావతి :** వి.ఐ.టి.– ఏ.పి విశ్వవిద్యాలయం మరియు టూన్జ్ యానిమేషన్ ఆధ్వర్యంలో వి.ఐ.టి – ఏ.పి విశ్వవిద్యాలయం క్యాంపస్ లో యానిమేషన్ ఫిలిం మేకింగ్ మరియు విజువల్ ఎఫెక్ట్స్ కోర్సుల్లో తరగతులు ప్రారంభించారు. దీనికి సంభందించి ఇప్పటికే మూవీ ప్రొడక్షన్ స్టూడియో కోసం మౌ చేసుకోవటం కూడా జరిగింది. టూన్జ్ యానిమేషన్ నుంచి నిష్ణాతులైన ఫాకల్టీ మెంబెర్స్ చేత (యానిమేషన్ ఫిలిం మేకింగ్ (ఎ.ఎఫ్.యం.ఎ) విజువల్ ఎఫెక్ట్స్ (వి.ఎఫ్.ఎక్స్) 3డి ఫినిషింగ్ ప్రొగ్రామ్(3 పి ఎఫ్‌పి)లలో తరగతులు నిర్వహిస్తామని , మీడియా స్టడీస్ నేర్చుకునే అవకాసం కల్పిస్తామని టూన్జ్ యానిమేషన్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ శశి కుమార్ పిళ్ళై తెలిపారు. వి.ఐ.టి.–ఏ.పి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డా॥ డి.సుభాకర్ మాట్లాడుతూ ఇంటర్నేషనల్ కుర్రిక్యులమ్ అండ్ ఎక్సపోసరఎతో వివిధ మూవీ స్టూడియోస్‌లో ఇంటర్న్‌షిప్ తో, యానిమేషన్ రంగంలో నిష్ణాతులతో పనిచేసే అవకాశం మరియు వి.ఐ.టి.–ఏ.పి విశ్వవిద్యాలయ మూవీ స్టుడియోలో లైవ్ ప్రాజెక్ట్స్ చేసే అవకాసం కల్పిస్తామన్నారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా॥ సి.ఎల్.వి శివ కుమార్ మాట్లాడుతూ అత్యాధునిక వసతులు మరియు అంతర్జాతీయ ప్రమాణాలతో మీడియా నిపుణులను తయారుచేసే విధంగా టూన్జ్ యానిమేషన్ వారితో ఒప్పందం కుదుర్చుకున్నామని తెలిపారు.

# తెలుగు రాష్ట్రాల్లో మంటే..



(మొదటిపేజీ తరువాయి)

రెండ్రోజుల్లో 45 డిగ్రీల వరకూ నమోదు కావచ్చని వాతావరణశాఖ అంచనా వేసింది. రాయలసీమలోని కర్నూలు, కడప, అనంత, చిత్తూరు జిల్లాలు నిప్పుల కుంపటిని తలపిస్తున్నాయి. రానున్న రెండ్రోజుల్లో రాయలసీమతోపాటు దక్షిణ కోస్తా జిల్లాల్లో సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నట్లు తాజాగా విడుదల చేసిన బులిటెన్‌లో పేర్కొంది. ఇదిలా ఉండగా దక్షిణ, ఉత్తర కోస్తా జిల్లాల్లో తేమశాతం పెరగడం వల్ల తీవ్ర ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతున్నారు. పసిపిల్లలు, వృద్ధులు నరకయాతన అనుభవిస్తున్నారు...

**జాగ్రత్తలు**

వీలైనంతవరకూ ఎండలో తిరగకుండా జాగ్రత్త పడాలి. మంచినీళ్లు ఎక్కువ తాగాలి. అలాగే... శరీరంలోషుగర్, లవణాల స్థాయి బ్యాలెన్స్‌గా ఉండేలా చేసుకోవాలి. కొత్తిమీర, పుదీనా వాటర్ తాగాలి. శరీరం కూల్‌గా ఉండేందుకు చలవ చేసే ఆహార పదార్థాలూ, పండ్ల రసాలూ, ద్రవాలూ తీసుకోవాలి. వడ దెబ్బ తగలకుండా తరచూ వాటర్ తాగుతూ ఉండాలి. అలసటగా, నీరసంగా ఉండేవారు వీలైనంతవరకూ ఎండలోకి వెళ్లకుండా ఉండటమే మంచిది. తుపాను వల్ల పెరిగే ఎండ తీవ్రత తిన్నగా బ్రెయిన్‌పై ప్రభావం చూపిస్తుంది. తిన్న ఆహారం అరగదు. వికారంగా ఉంటూ, వాంతులు వచ్చేలా అనిపిస్తుంది. తలనొప్పి వచ్చి, కళ్లు తిరుగుతాయి. ఈ సమస్యలన్నింటికీ చెక్ పెట్టాలంటే ఎండ బారిన పడకుండా జాగ్రత్త పడాల్సిందే.

## ఎన్నికల ఫలితాలరోజు రాష్ట్రంలో
# ఉద్రిక్త పరిస్థితులు ?

(మొదటిపేజీ తరువాయి)

అనుకూలంగా లేని పార్టీ, నాయకులు పెద్ద ఎత్తున విధ్వంసాలకు పాల్పడే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు. యాభై శాతం వి.వి. ప్యాడ్ ల స్లిప్పులను లేక్కించాలని తెలుగుదేశం కోరుతుండగా, ఐదు చోట్ల వి.వి. ప్యాడ్ ల స్లిప్పులను లేక్కించాలని ఇప్పటికే న్యాయస్థానం ఎన్నికల కమీషన్ ను ఆదేశించింది. ఈ కారణంగా గతంలో వైకపా తుది ఫలితాలు రావడానికి హెచ్చు సమయం పడుతుందని ఎన్నికల కమీషన్ వర్గాలు చెబుతున్నాయి.

ఓట్ల లెక్కింపులో ఈ సారి పార్టీ ఏజెంట్లు పలు అభ్యంతరాలు లేవనెత్తే అవకాశం ఉందని అంటున్నారు. ఓట్ల లెక్కింపు జరిగేచోట కట్టుదిట్టమైన ఏర్పాట్లు ఉన్నందున లెక్కింపు కేంద్రాలలో పరిస్థితి అదుపులోనే ఉంటుంది. ఫలితాల సరళి వెల్లడైన తరువాత బయట అల్లర్లు చెలరేగవచ్చని అనుమానిస్తున్నారు. ఫలితాలు వెల్లడైన రోజు కొన్ని చోట్ల జరగటం పరిపాటే. ఆ ఘర్షణలు కూడా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే రీతిలో ఉండవు. కాని, ఈ సారి అందుకు భిన్నంగా చాలా చోట్ల ఘర్షణలు జరుగవచ్చని అనుమానిస్తున్నారు. ఓట్ల లెక్కింపు రోజు నుంచి రెండు మూడు రోజులు భారీ స్థాయిలో బలగాలను పెట్టి శాంతిభద్రతలు అదుపులో ఉంచాలని ఎన్నికల కమీషన్ ఆలోచిస్తున్నది. లెక్కింపు జరిగే ప్రాంతాలలో 144 వ సెక్షన్ అమలులో ఉంటుంది. శాంతి భద్రతలను ద ృష్టిలో ఉంచుకొని ఇటీవల కాలంలో ఫలితాలు ప్రకటించిన రోజు గెలిచిన అభ్యర్థులు పార్టీలు, విజయోత్సవ ర్యాలీలను నిర్వహించడానికి అనుమతి ఇవ్వడం లేదు. ఈ సారి కూడా ఊరేగింపులకు అనుమతి ఉండదు. ఫలితాల విషయంలో ఉద్రిక్తతకు అవకాశం లేని విధంగా కార్యకర్తలను అదుపులో ఉంచుకోవలసిన బాధ్యతను పార్టీలు, నాయకులు తీసుకోవాలి. ఉద్రిక్తతలు పెరగడానికి కొన్ని సందర్భాలలో ప్రసార మాధ్యమాలు కారణమౌతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. శాంతి భద్రతల పరిరక్షణలో సంబంధం ఉన్నవారంతా ఈ విషయంలో శ్రద్ధ వహించవలసి ఉంది.


# రాజధాని క్లాసిఫైడ్స్

**హోటల్స్**

విజయవాడ
నోవోటెల్
ఫోన్ : 0866 6688999

విజయవాడ
గేట్ వే
ఫోన్ : 0866 6644444

విజయవాడ
సదరన్ గ్రాండ్
ఫోన్ : 0866 6677777

మల్కాపురం
స్వాగత్ మెస్ – ప్యూర్ వెజిటేరియన్
ఫోన్ : 90329 58580

రాయపూడి
కాకతీయ ఫుడ్ కోర్ట్
ఫోన్ 9848021898

**ఇతరములు**

విజయవాడ బెంజ్ సర్కిల్
మీటింగ్ హాల్
ఫోన్ : 76809 94755

తుళ్ళూరు
ఎస్.ఎమ్(స్టైల్ ఫర్ మెన్) టైలర్స్
ఫోన్ : 9440307123

మందడం
ఎస్.ఆర్.కె. గ్రాండ్ రెస్టారెంట్
ఫోన్ : 9553023388

వెలగపూడి
సాయి గణేష్ ట్రెడర్స్: నిర్మాణ రంగానికిసిమెంట్, స్టీలు, పైపులు, పెయింట్‌లు అమ్మబడును.
ఫోన్ : 9640811333

**రెంటల్స్**

రాయపూడి
రాజధాని ప్రాంతం రాయపూడిలో 250 గజముల ఖాళీ స్థలము అద్దెకు కలదు
ఫోన్ : 9440662699

విజయవాడ
విజయవాడ బెంజ్ సెంటర్ దగ్గరలో పార్కింగ్ వసతిగల 1 బెడ్‌రూమ్ ఇల్లు అద్దెకు కావలెను
ఫోన్ : 76809 94755

**హస్పటల్స్**

విజయవాడ
ఆంధ్ర హస్పటల్,
డా॥శ్రీమన్నారాయణ
ఫోన్ : 9177219900

విజయవాడ
న్యూఫేస్ కీనిక్ , డా॥మేహబూబ్
ఫోన్ : 9849122788

విజయవాడ
అష్రఫ్ మెటర్నిటీ & ఇ,ఎన్‌టి
డా॥ రెహమాన్
ఫోన్: 0866-2475087

**షాప్స్**

తుళ్ళూరు
రేమాండ్స్ టైలర్స్
ఫోన్ : 9492470426

రాయపూడి
వర్షిత ఫోటోస్టాట్
ఫోన్ : 9985853188

తుళ్ళూరు
వైభవ్ డ్రస్సెస్
ఫోన్ : 9848407935

తుళ్ళూరు
రాజా గోల్డ్ కవరింగ్
ఫోన్ : 9581500500


తుళ్ళూరు
శ్రీసాయి జ్యూయలరీ వర్క్స్
ఫోన్ :9247171083

**అమరావతి**

నీరుకొండ
ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీ
ఫోన్ : 0863 2343000

ఐనవోలు
విఐటీ యూనవర్సిటీ
ఫోన్ : 0863 2370444


# అవెంజర్స్ స్టార్ల పారితోషికాలు



**రాజధాని వార్తలు, డెస్క్ :** ప్రపంచవ్యాప్తంగా అవెంజర్స్ – ఎండ్ గేమ్ బాక్సాఫీస్ సంచలనాల గురించి తెలిసిందే. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని రికార్డుల్ని చెరిపేస్తూ 2 బిలియన్ డాలర్లు వసూళ్లను సాధిస్తుందని అంచనా వేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటివరకు 1.6 బిలియన్ డాలర్లు వసూలు చేసింది. రూ. 8381 కోట్ల బడ్జెట్ తో ఈ చిత్రం తెరకెక్కింది. ఇప్పటికే 10600 కోట్లు (1.6 బిలియన్ డాలర్) వసూళ్ల రికార్డును ఈ చిత్రం నమోదు చేసిందని తెలుస్తోంది. అయితే ఈ స్థాయిలో సంచలనాలు సృష్టిస్తున్న ఈ సినిమాలో నటించిన తారల పారితోషికాల మ్యాటర్ ఏమిటో? మార్వెల్ సంస్థ నుంచి ఏఏ హీరో ఎంత పారితోషికం అందుకున్నారో తెలుసుకుందాం.. ఈ సినిమాకి ఫేస్ ఆఫ్ ది హీరోగా రాబర్ట్ డౌనీ జూనియర్ పేరు మార్మోగుతోంది. అతడి నటన.. ఆహార్య ంలో పలికించిన ఎమోషన్ సినిమా ఘనవిజయంలో కీలక పాత్ర పోషించిందని క్రిటిక్స్ పొగడ్తల వర్షం కురిపిస్తున్నారు. ఐరన్ మ్యాన్‌గా అత్యంత ప్రభావవంతమైన సూపర్ హీరోగా రాబర్ట్ నటించారని ప్రశంసించారు. రాబర్ట్ గతంలో ఇన్ ఫినిటీ వార్ (అవెంజర్స్ 3) కోసం 521 కోట్లు (75 మిలియన్ డాలర్లు) అందుకున్నాడు. ఇన్ ఫినిటీ వార్‌కి కొనసాగింపుగా వచ్చిన ఎండ్ గేమ్ లో అతడి కామిక్ టైమింగ్.. ఎమోషనల్ పెరామేన్స్ అభిమానుల గుండెల్ని టచ్ చేసిందన్న ప్రశంస దక్కింది. ఇక ఈ ఫ్రాంఛైజీలోనే నంబర్ –1 పారితోషికం అందుకున్న హీరోగా అతడు పాపులరయ్యాడు. అతడికి అవెంజర్ సిరీస్ల ద్వారా ఇతరత్రా మార్గాల్లోనూ ప్రతిఫలాన్ని పొందే హక్కులను సొంతం చేసుకొన్నారని తెలుస్తోంది. అంటే 521 కోట్లను మించి అతడు ఈ సినిమాలో నటించినందుకు అందుకుంటున్నాడన్నమాట.

అయితే రాబర్ట్ డౌనీ జూనియర్ .. ఇంతకుముందు స్పైడర్ మ్యాన్ హోం కమింగ్ సినిమా కోసం రోజుకు 35 కోట్లు (5 మిలియన్ డాలర్లు) చొప్పున అందుకునే వాడట. ఆ సినిమా కోసం వారానికి మూడు రోజులు మాత్రమే ఆయన పని చేసేవారట. ఇక ఐరన్ మ్యాన్ సంచలనాల తర్వాత ప్రతీ సినిమాకు 139 కోట్ల (20 మిలియన్ డాలర్లు) పారితోషికం అందుకొనే అతికొద్ది మంది హాలీవుడ్ హీరోలలో ఒకడిగా రికార్డులకెక్కారు.

రాబర్ట్ డౌనీ తర్వాత అతడికి దరిదాపుల్లో పారితోషికాలు లేకపోయిన కళ్లు చెదిరే పారితోషికాలు ఎవరెవరికి దక్కాయిఅంటే.. స్కార్లెట్ జాన్సన్.. క్రిస్ హేమ్స్ వర్త్.. క్రిస్ ఇవాన్స్ పేర్లు వినిపిస్తున్నాయి. స్కార్లెట్ జాన్సన్‌కి సుమారు 139 కోట్ల (20 మిలియన్ డాలర్లు) పారితోషికం అందుకున్నారు. క్రిస్ఇవాన్స్ (కెప్టెన్ అమెరికా) .. క్రిష్ హేమ్స్ వర్త్ (థోర్) ఇన్‌ఫినిటీ వార్ కోసం 20 మిలియన్ డాలర్లు అంటే 139 కోట్లపారితోషికం రేంజ్ లో అందుకొన్నారు. ఎండ్ గేమ్ కి ఈముగ్గురూ అదే పారితోషికం అందుకున్నారు. ఎండ్ గేమ్ దాదాపు 46 దేశాల్లో విడుదలై అన్ని చోట్లా రికార్డుల మోత మోగిస్తోంది.







# నవ్యాంధ్రలో విద్యా కుసుమం ఎస్ఆర్ఎం


ప్రొఫెసర్లతో మాట్లాడుతున్న ప్రొ. వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి.నారాయణ రావు


ఎస్ఆర్ఎం అడ్మిన్ బ్లాక్


క్లాస్ రూమ్, లేబోరేటరీ బ్లాక్స్

**నవ్యాంధ్రలో విరిసిన విద్యాకుసుమం శ్రీరామస్వామి మెమోరియల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎస్ఆర్ఎం) వర్సిటీ. కేవలం ఐదునెలల్లోనే ఎస్ఆర్ఎం యూనివర్శిటిని ఏర్పాటు చేసిన ఘనత ఆ విద్యాలయానిదే. అత్యాధునిక విద్యాబోధనతోపాటు, ప్రపంచ స్థాయి లాబ్ ఏర్పాట్లతో నూతన రాష్ట్రంలో విద్యాపరిమళాలను వెదజల్లుతున్న ఎస్ఆర్ఎం ఏర్పాటులో ఎందరో విద్యావేత్తల కృషి ఉంది. అందులో ప్రముఖంగా ప్రొ. వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి.నారాయణ రావు ప్రముఖులు. కాలేజీని ప్రజలకు చేరువ చేయడంలో, ఎదురయ్యే సవాళ్లను అధిగమించడంలో ముందుండే నారాయణతో 'రాజధాని వార్తలు' ఎడిటర్ హుస్సేన్ ఖాన్ తో ఈవారం ముఖాముఖి..**

**మీ తల్లిదండ్రులు గురించి చెప్పండి?**
మా నాన్నగారు వ్యాపారం చేసేవారు. అమ్మ గృహిణి, మా స్వగ్రామం నెల్లూరు.. ఆర్ఎస్ఆర్ హైస్కూల్‌లో చదువుకొని, వీవీ కాలేజ్‌లో బీఎస్సీ చదివాను. చదువంటే విపరీతమైన ఇష్టం ఉండేది. అన్ని పోటీల్లో పాల్గొనేవాడిని.. పాల్గొన్న అన్నింటిలోనూ దాదాపుగా అన్ని మొదటి బహుమతులు నాకే వచ్చేవి. క్విజ్, డిబేట్, వ్యాసరచనల్లో ముందుండే వాడిని. 1973లో నాన్న అకాల మరణం చెందారు.

**విద్యారంగంలోకి రావడానికి గల కారణాలేంటి ?**
డిగ్రీ అవ్వగానే శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో ఎంఎస్సీ (ఫిజిక్స్)చదివాను. మా బంధువు సర్వోదయా కాలేజీలో భౌతిక శాస్త్ర విభాగాధిపతిగా అవకాశం ఇస్తానన్నప్పటికీ పరిశోధనలకు ప్రాధాన్యత ఇచ్చి నేషనల్ ఫిజికల్ లాబరేటరీ ఢిల్లీలో పీహెచ్‌డీ చేశాను. ఆపై ఎస్వీ వర్సిటీ రీడర్‌గా పనిచేశాను. విద్యావిషయంలో దూరదృష్టితో వ్యవహరించడం నాకు అలవాటు. రాష్ట్ర విభజన తర్వాత నవ్యాంధ్రలో చెప్పుకోదగ్గ విద్యాసంస్థలు ఏవీ లేవు. పేరెన్నికగన్న విద్యాసంస్థలన్నీ హైదరాబాద్‌లోనే ఉన్నాయి. దీంతో ప్రైవేటు విశ్వవిద్యాలయాల చట్టం తెస్తే బాగుంటుందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరాను. ఆయన వెంటనే అనుమతించారు. ఆపై ఎస్ఆర్ఎం యూనివర్సిటీ యాజమాన్య దృష్టికి తీసుకు వెళ్లి ఎస్ఆర్ఎంను ఇక్కడ స్థాపించాం.

**ప్రైవేటు విద్యాసంస్థలు విద్యను వ్యాపారం చేస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి ..దీనిపై మీ స్పందన ఏమిటి ?**
విద్యను వ్యాపారం చేయడం లేదు..నాణ్యమైన విద్య అందిస్తున్నాం.. విద్యార్థులకు ప్రపంచస్థాయి నైపుణ్యాలను పెంపొందిస్తున్నాం.. అందువల్లే ఏడాదిలోనే మా విద్యాసంస్థకు మంచి పేరు ప్రఖ్యాతులు వచ్చాయి. ఎస్ఆర్ఎం కు ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా దేశం నలుమూలల నుంచి, విదేశాల నుంచి కూడా విద్యార్థులు వస్తున్నారు.


**విశ్వవిద్యాలయం ప్రత్యేకతలేంటి ?**
విద్యార్థులు సులువుగా అర్థం అయ్యేలా ప్రాజెక్టుకు సంబంధించిన విషయాలు నేర్పటం మా ప్రత్యేకత. దేశంలోని ప్రతిష్టాత్మక విద్యా సంస్థలైన ఐఐటీలు, అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల నుంచి పీహెచ్‌డీ చేసిన వారిని అధ్యాపకులుగా నియామకాలు చేశాము. నాణ్యమైన విద్య అందించేందుకు ఎస్ఆర్ఎం ఎప్పుడూ ముందుంటుంది.

**చదువులో ముందున్న పేద విద్యార్థుల కోసం ఏం చర్యలు చేపడుతున్నారు ?**
మంచి మార్కులు తెచ్చుకున్న పేద విద్యార్థులకు ఉపకార వేతనాలను అందిస్తున్నాం.. గతేడాది 237 మంది విద్యార్థుల్లో 100 మందికి స్కాలర్‌షిప్‌లు అందించాం.. వీరిలో కొందరికి వందశాతం, మరికొందరికి 50 శాతం ఉపకార వేతనాలను అందించాం..

**మీ విశ్వవిద్యాలయంలో విద్యార్థుల సంఖ్య ఎంత ?**
1400 మంది విద్యార్థులున్నారు.

**ఎస్ఆర్ఎం పూర్వవిద్యార్థులు ఏమిచేస్తున్నారు ?**
మా పూర్వ విద్యార్థులు మన దేశంలోను వివిధ దేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. మరి కొందరు ఔత్సాహక పారిశ్రామిక వేత్తలుగా మారారు.

**ఇంజనీరింగ్‌పై వెర్రివ్యామోహం పెరగడంతో సోషల్ సైన్సెస్‌ను పట్టించుకోవడం లేదని విద్యావేత్తలు చెబుతున్నారు. దీనిపై మీ అభిప్రాయం ?**
మన దేశంలో 90% మందికి ఇంజనీరింగ్ లేదా సైన్సు విభాగాలు మాత్రమే ఉద్యోగ నియామకాలు జరుపుతున్నాయి. దీంతో విద్యార్థులు ఉద్యోగాల కోసం



ఎస్ఆర్ఎం ప్రొ. వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి.నారాయణ రావు గారితో ప్రత్యేక ఇంటర్వ్యూ...

> **ఎస్ఆర్ఎంలో పరిశోధనలకు ఏ మేరకు ప్రాధాన్యత ఇస్తుంది ?**
> మన దేశంలో అపారమైన వనరులు ఉన్నాయి. ప్రభుత్వం సరైన ఆర్థిక వనరులు కల్పించలేక పోతోంది. దీంతో పరిశోధనలకు ప్రాముఖ్యత తగ్గిపోతోంది. ఈ పరిస్థితుల్లో ఎస్ఆర్ఎంలో ఒకొక్క అధ్యాపకుడికీ రూ. 50లక్షలు ఇచ్చి పరిశోధనలను ప్రోత్సహిస్తోంది.

సైన్సు, ఇంజనీరింగ్ లపై ఆసక్తి చూపిస్తున్నారు. సోషల్ సైన్సెస్‌పై అవగాహన, అభివృద్ధి జరగటానికి ఇంకా కొంచెం సమయం పడుతుంది. ముఖ్యంగా మన దేశ ఆర్థిక పరిస్థితులు మెరుగున పడితే సోషల్ సైన్స్ పై అభిరుచి పెరుగుతుంది.

**సమాజిక నైతిక విలువల పెంపుదలకు శ్రద్ధవహిస్తున్నారా?**
మూడు దశాబ్దాలుగా సమాజంలో నైతిక విలువలు దిగజారాయి. నైతిక విలువలు - మానవ సంబంధాలపై జూన్ 4 నుంచి జూన్ 8 వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులకు ఇది బాగా ఉపయోగపడుతుంది.

**ఎస్ఆర్ఎం కోర్సుల వివరాలు తెలపండి ?**
దేశ,విదేశాల్లోని ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలలోని కోర్సులను పరిశీలించి, కంపెనీలకు ఎటువంటి నైపుణ్యత కల్గిన విద్యార్థులు అవసరమో తెలుసుకుని తదనుగుణంగా విద్యా కోర్సులను తయారు చేస్తున్నాం.

**విద్యార్థుల తల్లిదండ్రులకు మీరిచ్చే భరోసా ?**
ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి ఉన్న మంచిపేరుతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఇక్కడ చేర్చుతున్నారు. విలువలు, ఉన్నత విద్య, ఉద్యోగానికి శిక్షణ, ఉద్యోగాలు కల్పించటానికి మేము కృషి చేస్తున్నాం..

**తెలుగు మీడియం విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఉందా ?**
తెలుగు మీడియం విద్యార్థులకు 'బ్రిడ్జ్ కోర్సు'తో శిక్షణ ఇస్తున్నాము. వర్సిటీలో విభిన్న ప్రదేశాల నుంచి, వివిధ భాషలు మాట్లాడే విద్యార్థులుండటంతో సులభంగా ఇంగ్లీషు నేర్చుకుంటున్నారు. దీంతో మేము తెలుగు మీడియం విద్యార్థులను ఆకర్షించగల్గుతున్నాము.

**ఎస్ఆర్ఎం విజన్ ఏంటి ?**
ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయంగా అభివృద్ధి చెందటంతోపాటు, సైన్స్ మాత్రమే కాకుండా సోషల్ సైన్సెస్, లిటరేచర్, ఆర్ట్స్ కోర్సుల శాఖలు ఏర్పాటు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాము.

**యూనివర్సిటీల్లో ర్యాగింగ్‌ను తరచూ చూస్తున్నాం. ఇక్కడ ఏమైన అలాంటి సమస్యలున్నాయా?**
ప్రపంచస్థాయి ప్రమాణాలు, నైతిక విలువలతో కూడిన బోధనతోపాటు ఉపాధ్యాయుడు - విద్యార్థి మధ్య సంబంధాలు బలంగా ఉండటంతో మా వర్సిటీలో ర్యాగింగ్ సమస్యలు లేవు.

**ఎస్ఆర్ఎం ప్రత్యేకతలు ఏమిటి ?**
వివిధ కంపెనీలతో కలిసి పని చేయటం ముఖ్యంగా జీఈ, అమర్ రాజా బ్యాటరీ, బంగారు ఆభరణాల 3డి ప్రింటింగ్ కోసం (తనిష్క్), సీఆర్‌డీఏతో వాహనాలు డిజైన్ కోసం ఒప్పందాలు చేసుకున్నాం.

**కొత్త కోర్సుల వివరాలు చెప్పగలరా ?**
భారత వాతావరణ శాఖను ఇక్కడే ప్రారంభించారు. త్వరలోనే స్పోర్ట్స్ సైన్స్ సెంటర్‌ను ప్రారంభించి కోర్సులను మొదలు చేయనున్నాం.

**ఎస్ఆర్ఎంను ఎందుకు ఎంపిక చేసుకోవాలి?**
నాణ్యమైన ఉన్నత విద్యతోపాటు మంచి కోర్సులు, ఇండస్ట్రీకి తగ్గట్లుగా విద్యార్థులను తయారు చేయటంతో విద్యార్థులు ఇక్కడ చదవడానికి ఇష్టపడుతున్నారు.

**ఎస్ఆర్ఎంలో ఫీజురీయింబర్స్‌మెంట్ ?ఉచిత విద్యాసౌకర్యాలు ఉన్నాయా ?**
లేదు. అది ప్రభుత్వ కళాశాలకే వర్తిస్తుంది. అయితే మేము అవసరమైన విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం.

**స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారా ?**
మెరిట్‌తో ఉన్నవారికి ఉపాధ్యాయ వృత్తి లోనూ అలాగే అన్ని డిపార్ట్‌మెంట్‌లలో సహాయకులు, డ్రైవర్లు, సెక్యూరిటీ, మొదలగు రంగాలలో దాదాపు 400 పైగా ఉద్యోగ అవకాశాలను కల్పించాం.

**వర్సిటీ రహదారి వ్యవస్థ పరిస్థితి ఏమిటి ?**
ప్రస్తుతం రాజధాని నిర్మాణంలో భాగంగా విశాలమైనరోడ్లు కొరకు ప్రణాళికలు రచించారు. కొన్ని చోట్ల రోడ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది.

**హాస్టల్ వసతిపై వివరించండి ?**
విద్యార్థిని,విద్యార్థులకు వేరుగా హాస్టల్స్ ఏర్పాటు చేశాం. మంచి భోజనంతోపాటు ఆరోగ్య పరిసరాలను, ఆధునిక వ్యవస్థను ఏర్పాటు చేశాం. ఇది విద్యార్థులకు ఆనందాన్ని కలుగుజేస్తోంది.

**ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఈవీఎంల వాడకంపై ఒక సాంకేతిక నిపుణిగా మీ అభిప్రాయమేంటి?**
కొన్ని చోట్ల ఈవీఎంలు పాడవటం, మరికొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయించటంతో ఆలస్యంగా ఓటింగ్ మొదలు కావటంతో సమస్యలు తలెత్తాయి. అయితే పేపర్ బ్యాలెట్ కావాలని మెజారిటీ రాజకీయ పార్టీలు అడుగుతున్నాయి. అది వారి ఏజెండా కావచ్చు.

**మీకు సంతోషం కలిగించే విషయం ?**
ఇస్రో (ఐఎస్ఆర్ఓ) డైరెక్టరుగా ఐదు సంవత్సరాలు పనిచేయటం సంతోషంగా ఉంది.

**మీ జీవితం లక్ష్యం ఏంటి ? మీ ఫామిలి ?**
భార్య ఎస్ఆర్ఎంలో మెడికల్ ఆఫీసర్‌గానూ, కుమార్తె విదేశములో పరిశోధనా విభాగంలోనూ ఉన్నారు.

**ఎస్ఆర్ఎం వర్సిటీ సాధించిన విజయాలు ?**
ఫిబ్రవరి 2017లో శంకుస్థాపన చేసి కేవలం 5 నెలల్లోనే వర్సిటీని (జూన్‌లో) ప్రారంభించాం. ఇందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు త్వరగా రావటం, సీఆర్‌డీఏ మౌలిక వసతులు కల్పించడంతోపాటు ఎస్ఆర్ఎం యాజమాన్యం సహకారం, స్థానికుల తోడ్పాటుతో అతితక్కువ కాలంలో వర్సిటీని విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చాము. రాజధాని నగరంతో అభివృద్ధిలో భాగస్వాములం కావాలని ఎస్ ఆర్ఎం కోరుకుంటోంది.

## త్రీడీ ప్రింటింగ్‌లో వేసవి శిక్షణ


**రాజధాని వార్తలు, అమరావతి :** అమరావతిలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం, థీంక్ త్రీ డీ సంస్థలు సంయుక్తంగా త్రీ డీ ప్రంటింగ్‌పై వేసవి శిక్షణ అందించేందుకు సిద్ధమయ్యాయి. ఇంజనీరింగ్ విద్యార్థులకు నెల రోజుల పాటు ఈ శిక్షణా తరగతులు నిర్వహించనున్నాయి. జూన్ 1వ తేదీ నుంచి 30 వరకూ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ క్యాంపస్‌లో శిక్షణ ఉంటుందని ప్రొవైస్ ఛాన్సలర్ ఆచార్య డి.నారాయణరావు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఎడిటివ్ (త్రీడీ)మాన్యూఫ్యాక్చరింగ్ టెక్నాలజీ వేగంగా విస్తరిస్తోంది. మన దేశంలోనూ ఈ టెక్నాలజీని అందిపుచ్చుకునేందుకు వివిధ యూనివర్సిటీలు, పారిశ్రామిక సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. లేయర్ ఫ్యాబ్రికేషన్ విధానంలో వస్తువును తయారు చేసే పద్ధతిని ఎడిటివ్ (సంకలిత)తయారీ అంటారు. ఈ టెక్నాలజీతో ప్రస్తుతం కార్ల విడిభాగాలు, ఇంజిన్ నాజిల్స్, ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్ భాగాలు ఎక్కువగా తయారు చేస్తున్నారు. పౌడర్, లిక్విడ్ రూపాల్లో ఉన్న ముడి సరుకు ద్వారా త్రీ డీ, లేజర్ టెక్నాలజీతో పూర్తి స్థాయిలో వస్తువును తయారు చేయడం ఎడిటివ్ మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీ ప్రత్యేకత. ఈ టెక్నాలజీపై ఇంజినీరింగ్ విద్యార్థులకు సమగ్రమైన అవగాహన కలిగించాలన్న ఉద్దేశంతో వేసవి శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్నట్లు ప్రొ వీసీ నారాయణరావు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు యూనివర్సిటీ సర్టిఫికెట్ ప్రదానం చేస్తుందన్నారు. తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు విజయవాడ, గుంటూరు బస్టాండ్‌ల నుంచి ఉచిత బస్సు, మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తున్నామన్నారు. కేవలం 50 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ ఫీజు కింద రూ. 500 లు చెల్లించి తరగతులుకు హాజరు కావాలని శిక్షణా తరగతుల ఇన్‌చార్జి డాక్టర్ పంచాగ్నుల జయప్రకాశ్ శర్మ పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9666781417 నెంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

## ఎస్.ఆర్.ఎంలో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రారంభం

**రాజధాని వార్తలు, నీరుకొండ :** నీరుకొండ ఎస్.ఆర్.ఎం విశ్వవిద్యాలయంలో బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు కామన్ కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ఎస్.ఆర్.ఎం జెఈఈఈఈ పరీక్షల్లో 1 నుంచి 12 వేల ర్యాంకులు పొందిన విద్యార్థులు తొలిరోజు హాజరయ్యారు. ఈనెల 7 తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని ప్రో వీసీ నారాయణరావు తెలిపారు.


నిర్మాణంలో ఉన్న రీసెర్చ్ బ్లాక్


ఇంజనీరింగ్ ల్యాబ్


లైబ్రరీ



అత్యవసర సమయంలో అంబులెన్స్

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2019-21, Cell 7680994755, Email : rajadhanivartalu1@gmail.com